క్లుప్తంగా

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



వెల్దండ: మండలంలోని లాల్‌తండా, ఎంజీతండా, మర్రిగుంత తండాల్లో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ పాడి రైతులు పశువులను జాగ్రతగా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం పశువులకు ఉచితంగా టీకాలను వేస్తుందని సీజనల్ వ్యాధుల నుంచి పశువులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరేష్‌రెడ్డి, నరసింహ, ఫణిందర్‌రెడ్డి, శ్రీను, తిరుపతయ్య, గోపాలమిత్రలు బాలు, మొగులయ్య, సాయిబాబా, విజేందర్ ఉన్నారు.

చలో వరంగల్ వాల్ పోస్టర్ విడుదల



అచ్చంపేట: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం పట్టణంలో బీఆర్‌ఎస్ యువజన నాయకులు కొర్ర వంశీనాయక్ విడుదల చేశారు. అచ్చంపేట మండలం చేదురుబావితండా, కన్యతండా, కొర్రతండా, దుబ్బతండా, ఐనోలు, శివారుతండా, సింగారం పెద్దతండాతో పాటు వివిధ గ్రామాల్లో పోస్టర్లు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. దాసరి మల్లయ్య, మాజీ సర్పంచు కిషన్, లాల్య, చంద్రు, హున్య, గోపాల్, రమేష్, సామ్యా, సూర్య తదితరులు పాల్గొన్నారు.

‘ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు’

కొల్లాపూర్: రుణమాఫీ చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీజేపీ మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ విమర్శించారు. బుధవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ అసంపూర్తిగానే ఉందన్నారు. గ్రామాల్లో 50 శాతం మేరకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. అర్హులందరికీ రుణమాఫీ చేయాలని కోరారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం

తాడూరు: కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని మాస్టర్ ఎర్రోళ్ల వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో డ్రాగన్ స్క్వాడ్ కుంగు పూ కరాటే బెల్టు టెస్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీలలో 25 మంది విద్యార్థులు హాజరై ఎల్లో, గ్రీన్, ఆరంజ్ బెల్టుల కోసం తలపడ్డారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాజమల్లు, వాసిడన్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు బీరువాలు వితరణ



కందనూలు: నాగర్‌కర్నూల్ మండలం మంతటిలో బుధవారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, ప్రాథమిక పాఠశాల 1, 2లకు రూ.1.60 లక్షల విలువ చేసే బీరువాలు, వాటర్ ఫిల్టర్ వితరణ చేశారు. రికార్డులు భద్రపర్చేందుకు బీరువాలు అందజేసినట్లు పూర్వ విద్యార్థుల తెలిపారు. కార్యక్రమంలో దాసరి బాలస్వామి, మాజీ సర్పంచ్ నాగయ్య, కృష్ణయ్య, రాఘవేంద్ర, జి.లింగారెడ్డి, డీలర్ శ్రీను, ఎస్.సంతోష్‌కుమార్, ఈర్ల వెంకటయ్య పాల్గొన్నారు.

క్వారీల్లో ఈతకు వెళ్లకుండా చూడండి

బిజినేపల్లి: వట్టెం జలాశయం పరిధిలోని క్వారీల్లో నీళ్లు ఉండటంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి పిల్లలు, యువకులు ఈత కోసం వస్తున్నారని వారిని రాకుండా చూడాలని బుధవారం హెచ్‌ఈఎస్ కంపెనీ ప్రతినిధులు బిజినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో క్వారీల్లో ఈత కోసం వచ్చిన వారిలో కొందరు మృత్యువాత పడ్డారని, దానిని దృష్టిలో ఉంచుకుని క్వారీల్లోకి యువకులు ఈతకు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని, అయిన యువత వాటిని పట్టించుకోకుండా వస్తున్నారని వివరించారు.

ప్రమాదాల నివారణపై దృష్టి



వెల్దండలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వెల్దండ: హైదరాబాదు-శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో రోజురోజుకు వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగిపోతున్నాయి. వాహనదారులు రద్దీ అధికంగా ఉంది. వాహన దారులు ఇష్టారాజ్యంగా అతివేగంగా వాహనాలను నడపడంతో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటుయి. రోడ్డు ప్రమాదాలను నివారించాలనే లక్ష్యంతో పోలీస్ యంత్రాంగం ప్రణాళికతో ముందుకెళ్తోంది. హైదరాబాదు-శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో పోలీసులు పెట్రోలింగ్‌లు, బ్లూకోర్టు కానిస్టేబుళ్లు ప్రతి నిత్య పర్యవేక్షణ నిర్వహిస్తున్నారు.

రోజు వాహనాల రద్దీ

హైదరాబాద్ నుంచి వెల్దండ మీదుగా శ్రీశైలం, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ తదితర పట్టణాలకు రాకపోకలు కొనసాగిస్తారు. హైదరాబాదు-శ్రీశైలం జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రద్దీగా దర్శనమిస్తాయి. ఈ ప్రాంతాల్లో నిత్యం వెల్దండ పోలీసులు పర్యవేక్షించి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి నిత్యం స్థానిక ఆటో యూనియన్ నాయకులతో పాటు వాహన దారులకు అవగాహన కల్పిస్తుంటారు. వీకేండ్ కావడంతో ప్రతి శనివారం, ఆదివారం రోజుల్లో రోడ్డు రద్దీగా ఉండడంతో వాహనదారులు అతివేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతుంటాయి. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ ఉండడంతో ప్రతి రోజు సాయంత్రం పోలీసుల వాహనాల తనిఖీలు చేపడుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు

ఇప్పటి వరకు గతేడాదిలో 2100 వాహనాలకు జరిమానాలు విధించారు. 136 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశారు. 50 ద్విచక్రవాహనాలకు సరైన పత్రాలు, నంబర్‌ప్లేట్లు లేకపోవడంతో సీజ్ చేశారు. మూల మలుపుల వద్ద ఫైబర్ పోల్స్, ప్రమాదాల సంఘటల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నిత్యం తనిఖీలు చేస్తున్నాం

హైదరాబాదు-శ్రీశైలం జాతీయ రహదారి కావడంతో వెల్దండ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో నిత్యం వాహనాల తనిఖీ చేస్తున్నాం. హైదరాబాదు నుంచి శ్రీశైలం భక్తులు వీకెండ్‌లో ఎక్కువగా వెళ్తుంటారు. అతివేగంగా వెళ్తున్న వాహనాలను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం తనిఖీ చేపట్టి సరైన పత్రాలు లేని వాహనాలపై జరిమానా విధిస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడుపుతున్నవారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నాం.

–కురుమూర్తి, ఎస్‌ఐ, వెల్దండ

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తాడూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బలాన్‌పల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. నిరంతరం రైతుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. మండలంలో సింగిల్ విండోల ద్వారా 11 కొనుగోలు కేంద్రాలను, ఐకేపీ ఆధ్వర్యంలో రెండు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. క్వింటాల్‌కు రూ.500 ప్రభుత్వం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్‌రాంచంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట సామగ్రి పంపిణీ

బిజినేపల్లి: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు విద్యాశాఖ నుంచి వంట పాత్రలను బుధవారం పంపిణీ చేశారు. పాఠశాలలో 20 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు వంట సామగ్రి అందజేస్తునట్లు తహసీల్దార్ శ్రీరాములు, ఎంఈఓ రఘునందన్‌రావులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న కంటి వైద్య శిబిరం

వంగూరు: మండలంలోని కొండారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన కంటివైద్య శిబిరం బుధవారం కొనసాగింది. మండలంలోని పలు గ్రామాల నుంచి వృద్ధులు అధికసంఖ్యలో హాజరయ్యారు. 300 మందికి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు వచ్చే వారికి భోజన వసతి కల్పించారు. విజయడెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డిలు పర్యవేక్షించారు. ఆపరేషన్ చేయించుకున్న వారితో మాట్లాడారు. మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

దరఖాస్తులు ఇవ్వాలి

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాలలో రాజీవ్ యువ వికాస్ కోసం దరఖాస్తు చేసుకున్న యువతీయువకులు వాటికి సంబంధించిన పత్రాలు ఎంపీడీఓ కార్యాలయంలో ఇవ్వాలని ఎంపీడీఓ దేవేందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల్లో దరఖాస్తు పత్రాలు ఇవ్వాలని కోరారు.

అంబేడ్కర్‌కు సివిల్ ర్యాంకర్ నివాళి

వంగూరు: మండలం తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు సివిల్ సర్వీసులో 934 ర్యాంకు సాధించిన సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ర్యాంకర్‌ను అభినందించి సన్మానించారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం



ఎంగంపల్లి రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహిస్తున్న నాయకులు

కల్వకుర్తి రూరల్: దేశంలో రాష్ట్రంలో రాజ్యాంగ పరిరక్షణకు నిరంతరం కట్టుబడి ఉండే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం మండలంలోని ఎంగంపల్లిలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గడపగడపకు రాజ్యాంగ పరిరక్షణ మహాత్ముని శాంతి సందేశంను గ్రామస్తులకు వివరిస్తూ గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. గడపగడపకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి, ఎన్నికల హామీల అమలు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, బాలరాజ్, నాని యాదవ్, బండి సుదర్శన్, జంగయ్య, శ్రీధర్‌రెడ్డి, సత్యం, వంశీ, తిరుపతి రెడ్డి, కిషోర్ రెడ్డి, జాంగిర్, రామస్వామి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్లభాష దినోత్సవం

వెల్దండ: మండలంలోని గుండాల గ్రామంలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో బుధవారం ఆంగ్లభాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆంగ్లభాషలో వివిధ ప్రదర్శనలను వివరించారు. ఇంగ్లీషు భాష ప్రాముఖ్యతను వివరించారు. ఆంగ్ల పద్యపారాయణం, ఉపన్యాసాలు తదితర అంశాల్లో విద్యార్థులు చక్కటి ప్రదర్శన చేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు చేసిన ప్రతిభను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రదీప్‌కుమార్, ఆంగ్లభాష ఉపాధ్యాయులు సుమన్, చంద్రబాబు, రిపూజాష్, పాఠశాల ఉపాధ్యాయులు సుధీర్, శంకర్‌లాల్, రాంప్రసాద్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

నేడు భూభారతిపై అవగాహన

చారకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంపై గురువారం మండల కేంద్రంలో రైతు వేదికలో ఉదయం 10:30 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ అద్దంకి సునాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్ అమరేందర్, కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు, రైతులు, అధికారులు, నాయకులు కావాలని కోరారు.

ఉగ్రవాదుల దాడిపై నిరసన



నాగర్‌కర్నూల్‌లో అంబేడ్కర్ చౌరస్తా వద్ద డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

సాక్షి, నెట్‌వర్క్: కశ్మీర్ ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. ఉగ్రవాదులను ఉరితీయాలంటూ నినాదాలు చేశారు. కూడళ్లలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

- ఉగ్రవాదుల చర్యను ముక్తకంఠంతో ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు పాదిల రామయ్య, కొంపల్లి అశోక్ జిల్లా నాయకులు నాగపూర్ మధు, యాదయ్య, సురేందర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కశ్మీర్‌లో పర్యాటకులను కాల్చి చంపడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- ఉగ్రవాదులను ఉరితీయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు పాదిల రామయ్య, నాయకులు రమేష్, మల్లికార్జున్, కురుమయ్య, శివ, శ్రీశైలం, రామకృష్ణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.
- కల్వకుర్తి పట్టణంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 27 మంది ప్రాణాలను పొట్టన పెట్టుకోవడం అమానుషం అన్నారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి మహబూబ్‌నగర్ చౌరస్తాలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ, బీజేపీ, హిందూ వాహిని, హిందూ ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.
- పెద్దకొత్తపల్లిలో విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణయ్య, పరశురాములు, భీమేష్, రాంమల్లయ్య, వెంకట్‌రెడ్డి, సుధాకర్‌రావు, లింగస్వామి పాల్గొన్నారు.
- జమ్ము కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ లింగాల మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. మాజీ సర్పంచు కోనేటి తిర్పతయ్య, బీజేపీ నాయకులు మహేశ్వరం, నవీన్, విష్ణు, బుడ్డయ్య, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.
- తెలకపల్లి మండల కేంద్రంలో నెహ్రూ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు హిందు సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.
- అచ్చంపేట జమ్ముకాశ్మీర్‌లోని పహల్గమ్‌లో ఉగ్రవాదులు దాడిని సీపీఎం జిల్లా నాయకుడు శంకర్ నాయక్ ఖండించారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.
- వెల్దండ మండల కేంద్రంలోని ఏబీవీపీ ఆధ్వర్యంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏబీవీపీ నగర కార్యదర్శి వంశీగౌడు, నాయకులు ప్రశాంత్, నందుగౌడు, నాగరాజు, శివ, సతీష్, చరణ్ తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో



తెలకపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతుధర



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ పి అమరేందర్

ఉప్పునుంతల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గిట్టుధర లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి అమరేందర్ అన్నారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్వింటాలుకు రూ. 2320లతోపాటు క్వింటాలుకు రూ. 500ల బోనస్ ఇస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సీసీ వేయించడంతోపాటు వర్షాలకు తడవకుండ కవర్లు అందుబాటులో ఉంచాలని రైతులు అదనపు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రఘునాథరావు, తహసీల్దార్ ప్రమీల, పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, ఏఓ రమేష్, పీఏసీఎస్ సీఈఓ రవీందర్‌రావు, డైరెక్టర్లు నారాయణ్‌రెడ్డి, శ్రీనివాసులు, సాయిబాబు, రవీందర్‌రావు, నాయకులు అనంతరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

- భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి అమరేందర్ అన్నారు. బుధవారం స్థానిక రైతు వేదికలో భూభారతిపై నిర్వహించిన అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా తమ భూములను రికార్డుల్లో సరిచూసుకోవడంతోపాటు మోకా (పొజీషన్)పై ఉండాలన్నారు. సదస్సులో తహసీల్దార్ ప్రమీల, అనంతరెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింహారావు, గోవర్ధన్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేత



తాడూరులో ప్రగతిపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

తెలకపల్లి/తాడూరు: పాఠశాలకు గురువారం వేసవిసెలవులు ప్రారంభంకానుండటంతో బుధవారం విద్యార్థులకు ప్రగతిపత్రాలను అందజేశారు. తెలకపల్లి మండలంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థుల రిపోర్టు కార్డులను పంపిణీ చేశారు. ఎండలకు ఎక్కువగా తిరుగొద్దని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఎమ్మార్సీ భవనంలో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంటపాత్రలను అందజేశారు. తాడూరు మండల కేంద్రంతోపాటు అయా గ్రామాల విద్యార్థులకు ప్రగతి పత్రాలను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల అల్లాపూర్ పాఠశాలలో హెచ్‌ఎం కట్టా శ్రీనివాస్‌రెడ్డి వారి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. హెచ్‌ఎంలతోపాటు, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకు సాగుదాం



కల్వకుర్తి రూరల్: సమస్యలను పరిష్కరించుకునేందుకు సమష్టిగా ముందుకు సాగాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జూలూరు రమేష్ బాబు కోరారు. బుధవారం పట్టణంలో నూతన డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బిచని బాలకృష్ణ, కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి రవి, కృష్ణయ్య, వెంకటేష్, ప్రభాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేత



లింగాల: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో కొన్ని రోజుల కిందట చిరుత పులి దాడిలో గొర్రె మృత్యువాత పడింది. మండలంలోని పాత దారారం గ్రామానికి చెందిన గొర్రె యజమాని నిమ్మల మహేష్‌కు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం అటవీ శాఖ కార్యాలయం ఆవరణలో సంబంధిత అధికారులు బాధితుడికి చెక్కు అందజేశారు. ఎఫ్ఆర్వో ఈశ్వర్, డీఆర్వో జయదేవ్, బీట్ ఆఫీసర్లు శివాజీ, ఖాదర్‌పాష, మురళీకృష్ణ, రవీందర్ పాల్గొన్నారు.

ముగిసిన గిరిజనుల జాతర



తిమ్మాజిపేట: మండలంలోని రాళ్లచెరువు తండా రెండు రోజులో పాటు గిరిజనులు జాతర నిర్వహించారు. ముగింపు సందర్భంగా బుధవారం తుల్జా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పిల్లా పాపలతో చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఒక్కో ఇంటిలో రూ.50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు పండుగ ఖర్చులు వెచ్చించారు. ఆడపడుచులు పుట్టింటికి రావడంతో గ్రామంలో సందడి కన్పించింది. దేవతా మూర్తుల ప్రతిమల వద్ద పలు రకాల ధాన్యపు గింజలు పెట్టి పూజించారు. రాత్రి భజనలు చేస్తూ అమ్మవారిని కొలిచారు.

దేశంలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలి



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒకే దేశం ఒకటే ఎన్నిక అనే అంశంపై చర్చించారు. ఒకే దేశం ఒకే ఎన్నికకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామచంద్రారెడ్డి, బాబీ దేవ్, రవి గౌడ్, సురేందర్ గౌడ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన నలుగురికి న్యాయమూర్తి కావ్య జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన అక్తర్, సురేందర్, రాజు, పెద్దకొత్తపల్లికి చెందిన రాజ్ కుమార్ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. వీరిని కోర్టులో హాజరుపర్చాగా న్యాయమూర్తి అక్తర్, సురేందర్ కు రెండు రోజుల జైలు శిక్ష, రాజ్ కుమార్, రాజుకు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

సభకు తరలిరావాలి

కొల్లాపూర్: ఈనెల 27 వతేదీన వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ సభకు పార్టీ శ్రేణులు తరలి రావాలని బీఆర్‌ఎస్ మున్సిపల్ ప్రెసిడెంట్ సాంబ శివుడుయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మారెడు శివశంకర్

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం సహాయ కార్యదర్శిగా మారేడు శివశంకర్ ఎంపికయ్యారు. శంషాబాద్ పట్టణంలో రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర నాలుగో మహాసభలు ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎంపికైనట్లు మారేడు శివశంకర్ తెలిపారు.

టీకాలు వేయించాలి

పాన్‌గల్: చిన్నారులు, గర్భిణులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. బుధవారం మండలంలోని కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి సబ్‌సెంటర్లను ఆయన సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పౌష్టికాహారం తీసుకోవడం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు తారశాంక్, వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, సంతోషిదేవి, సరళ, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఇంటిబాట పట్టిన హాస్టల్ విద్యార్థులు



వెల్దండలో ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు

వెల్దండ: పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో బుధవారం విద్యార్థులు వసతి గృహాల నుంచి ఇంటిబాట పట్టారు. బస్సు ప్రాంగణాలు, కూడళ్లలో విద్యార్థులు, కుటుంబ సభ్యులతో రద్దీ కన్పించింది. బస్సులలో సీట్లు దొరకక పల్లెలకు ఆటోలలో ప్రయాణించారు. పిల్లలను సెలవులలో జాగ్రతగా చూసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణరత్నం విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.